క్లుప్తంగా

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లు

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంటలపాలెం బుర్రబావి దగ్గర గల శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు అమ్మవారికి ఏకవింశతి వార్షిక మహా కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు కొండిన్య శర్మ తెలిపారు. రాజరాజేశ్వరి అమ్మవారికి పసుపు, కుంకుమ అలంకారం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు తీర్థ గ్రహణం, గణపతి పూజ పుణ్యాహవాచనం, మాతృకాపూజ, దీక్ష గ్రహణం, పంచగవ్య సంస్కారం, అఖండ దీపస్థాపన, ధ్వజారోహణంతో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భోగ శ్రీనివాసమూర్తికి వెండి సింహాసనం



వెండి సింహాసనం సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు మెట్రో: స్థానిక కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో భోగ శ్రీనివాస మూర్తికి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీలత, బొత్తుల సుభాష్‌చంద్ర, భవాని, శ్రీగిరి దేవస్థానం కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ఇందిరాదేవి దంపతులు గురువారం వెండి సింహాసనం సమర్పించారు. దాతలను శ్రీగిరి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు అభినందించారు.

పేద మహిళకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకుల కిట్ అందిస్తున్న రేవంత్ శర్మ, పక్కన హోంగార్డు కాశయ్య

మార్కాపురం: పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో నివాసముంటున్న పేద మహిళ మౌలాబీకి ట్రాఫిక్ హోమ్‌గార్డు చెన్నుపల్లి కాశయ్య ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర వస్తువులు అందించారు. అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రేవంత్ శర్మల ఆర్థిక సహకారంతో బియ్యం, కందిపప్పు, కూరగాయలు, నూనె తదితర నిత్యావసర వస్తువుల కిట్‌ను కొనుగోలు చేసి అందజేశారు. మౌలాబీకి ఇటీవల యాక్సిడెంట్ కావడంతో ఇంటికే పరిమితమైంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో దాతల సహకారంతో సాయం చేసినట్లు కాశయ్య తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

గిద్దలూరు రూరల్: రెవెన్యూ శాఖలోని ప్రతి అధికారి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నించాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ్ అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ శాఖలోని అధికారులకు శాలువాలు కప్పి సన్మానించి మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందిస్తూ వారి సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూశాఖ అధికారుల ప్రధాన ధ్యేయంగా పనిచేయాలన్నారు. డీటీ సుబ్బారావు, వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య, ఎలక్షన్ డీటీ భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు స్వర్ణలతారెడ్డి, బొర్రా వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విచారణ చేసి.. చర్యలు తీసుకుంటాం

రాచర్ల: మండలంలోని ఒద్దులవాగుపల్లె గ్రామం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తూ రాత్లావత్ సురేష్ నాయక్ విద్యుదాఘాతానికి గురైన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఎస్ఈ ఆదేశాల మేరకు జిల్లా ప్రొటెక్షన్ అధికారి ఎం.ధనలక్ష్మి గురువారం అనుమలవీడు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో బుధవారం విధుల్లో ఉన్న షిఫ్ట్ ఆపరేటర్ ఎల్‌సీ ఇచ్చాడా.. లేదా అనే కోణంలో సబ్‌స్టేషన్‌లోని మీటర్ డేటాను సేకరించారు. సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్‌ను ప్రస్తుతం విధుల నుంచి తొలగించామని, సబ్‌స్టేషన్‌లోని మీటర్ డేటాను పరిశీలించిన అనంతరం సంబంధించిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాల దిగుబడి ఢమాల్!

- వేసవిలో గడ్డి, నీటి కొరతే కారణం
- రైతు కుటుంబాల్లో ఆర్థిక కష్టాలు

పశ్చిమ ప్రకాశంలో పశు సంపద

ఆవులు, ఎద్దులు	35,456
గేదెలు	3,76,520
పాలిచ్చే గేదెలు	1,19,200(సుమారు)
పాల డెయిరీలు	10
రోజూ పాల దిగుబడి	4.50 నుంచి 4.75 లక్షల లీటర్లు

మార్కాపురం:

వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాల దిగుబడి తగ్గింది. మార్చి నెలాఖరు నుంచి పశ్చిమ ప్రకాశంలో పచ్చిగడ్డి, నీటి కొరత మూలంగా పాలిచ్చే గేదెల సంఖ్య క్రమంగా తమ్ముముఖం పడుతోంది. ఆగస్టు నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని అంచనా. ఈ నేపథ్యంలో రైతులు, పశుపోషకులు గత మూడు, నాలుగు నెలల నుంచి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రతి గేదె ఉదయం, సాయంత్రం కలిపి 8 నుంచి 9 లీటర్ల పాలు ఇస్తుంది. మార్చి నుంచి ఆగస్టు వరకూ వేసవి కాలంలో ఉదయం సాయంత్రం కలిపి 4 నుంచి 5 లీటర్ల పాలు మాత్రమే ఇస్తుంది. ప్రస్తుతం లీటరు పాల ధర వెన్నశాతాన్ని బట్టి రూ.65 నుంచి 70 రూపాయల వరకూ పలుకుతోంది.

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో పది పాల డెయిరీలు ఉన్నాయి. యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలంలోని కుంట, మార్కాపురం, బేస్తవార పేట, గిద్దలూరు ప్రాంతాల్లో పాల డెయిరీలకు ఏటా వేసవిలో రోజూ సుమారు 4 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. వర్షాకాలమైతే రోజుకు దాదాపు 7 లక్షల లీటర్ల పాలు డెయిరీలకు పోస్తున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. డివిజన్ మొత్తం మీద ఉన్న హోటల్స్, గృహాలు, రెస్టారెంట్లు, టీ హోటళ్లలో కలిపి దాదాపు 3 లక్షల లీటర్ల పాలను వినియోగిస్తున్నట్లు అంచనా. మిగిలిన లక్ష లీటర్ల పాలను మిల్క్ వెండర్స్ హైదరాబాద్, విజయవాడకు పంపుతున్నారు. ప్రస్తుతం పాల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో అవసరాన్ని బట్టి రూపాయి నుంచి రెండు రూపాయల వరకూ వ్యాపారులు ధర పెంచి విక్రయిస్తున్నారు.

రోజూ గేదెకు రూ.70 ఖర్చు

ప్రస్తుతం పొలాల్లో, గ్రామాల్లో పచ్చిగడ్డి కొరత ఎక్కువగా ఉండటంతో పశుపోషకులు, రైతులు ఎండుగడ్డి, దాణా, మిశ్రమాలపై ఆధారపడుతున్నారు. రోజుకు ఒక్కొక్క గేదెకు 50 రూపాయల నుంచి 70 రూపాయల వరకూ ఖర్చు చేస్తున్నారు. రైతులకు పశుపోషణ భారమే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో భరిస్తున్నారు. ప్రస్తుతం 4 లీటర్లకు సుమారు రూ.240 నుంచి 260 రూపాయలు పశుపోషకులకు దక్కుతున్నాయి. ఆగస్టు నెలాఖరు వరకూ ఇదే పరిస్థితి. కరువు కాలంలో పాడి పరిశ్రమ ఆదుకుంటోందని మార్కాపురం మండలంలోని గజ్జలకొండ, వేములకోట గ్రామాలకు చెందిన పలువురు రైతులు తెలిపారు. వ్యవసాయ పనులు, కూలీ పనులు లేక కుటుంబ పోషణ భారమైన నేపథ్యంలో పాల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం పచ్చిగడ్డి కొరత ఎక్కువగా ఉండటంతో ఎండుగడ్డిని నర్సరావుపేట, వినుకొండ ప్రాంతాల నుంచి ట్రాక్టర్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ ఎండుగడ్డి సుమారు రూ.14 వేల నుంచి రూ.15 వేల ధర పలుకుతోందని పశుపోషకులు తెలిపారు.



పాలు తీస్తున్న మహిళ



మేత కోసం వెళ్తున్న గేదెలు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎండుగడ్డి

నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ



నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బోడేనాయక్ తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డితో పాటు వారి స్నేహితుడు శ్రీనివాసరెడ్డిలు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్ నాయక్, పాఠశాల చైర్మన్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



గేదె కళేబరం

దర్శి: దర్శి మున్సిపాలిటీ పరిధిలోని శివరాజ్‌నగర్‌కి చెందిన ఎం.భవాని అనే మహిళ గేదె గురువారం విద్యుత్ షాక్ గురై మృతి చెందడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం ఉదయం గేదెలను మేపుకునేందుకు ఎన్‌ఏపీ ట్యాంక్ సమీపానికి వెళ్లింది. సాయంత్రం గేదెలను ఇంటికి తోలుకొని వస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగెలకు గేదె కొమ్ములు తగులకోవడంతో షాక్ గురై ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు భవాని తెలిపారు. గేదె విలువ సుమారు లక్ష రూపాయలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ..?



మంగమూరుదొంకలో ప్లాస్టిక్ వ్యర్థాలను నములుతున్న పశువు

ఒంగోలు: ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమలు చేయడంలో నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా ఒంగోలును తీర్చిదిద్దాలనే లక్ష్యం అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా నీరుగారుతోంది. నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తుండటమే అందుకు నిదర్శనంగా ఉంది. అందాల నగరం - మనందరి బాధ్యత అంటూ స్థానిక మంగమూరుడొంకలో ఒక వాల్ పెయింటింగ్ ఉంది. సమీప దుకాణాల యజమానులు నిత్యం అక్కడ పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తున్నారు. వాటితో పాటు ఆహార వ్యర్థాలు కూడా అక్కడ వేస్తుండటంతో పశువులు తినేందుకు వచ్చి ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా నములుతున్నాయి. పశువుల శరీరంలోకి ప్లాస్టిక్ వెళితే పరిస్థితి ఏంటనే కనీస విచక్షణ కూడా లేకుండా స్థానికులు వ్యవహరిస్తున్నారు. ఇదంతా నిత్య ప్రక్రియగా మారినప్పటికీ ప్లాస్టిక్‌ను కనీసం రోడ్డు పక్కన వేయకుండా చెత్త బుట్టలో వేద్దామనే ఆలోచన కూడా స్థానికులు చేయడం లేదు. చివరకు అధికారులు, సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఫలితంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

శిలాఫలకాలపై తొలగని ముసుగు



మల్లవరం డిజిటల్ లైబ్రరీ వద్ద శిలాఫలకంపై తొలగించని స్టిక్కర్లు



కుంచేపల్లిలో హెల్త్ క్లినిక్ వద్ద ఇలా..



కుంచేపల్లి ఆర్బీకే వద్ద శిలాఫలకానికి స్టిక్కర్

పొదిలి రూరల్: సాధారణ ఎన్నికలు ముగిసి కోడ్ ఎత్తి వేసినా ఆ సమయంలో శిలాఫలకాలపై వేసిన స్టికర్లను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొదిలి నగర పంచాయతీలో 8 సచివాలయాలతో పాటు ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్ల, ఆముదాలపల్లి, గొల్లపల్లి, కుంచేపల్లి, మల్లవరం, సూదనగుంట, కొండాయపాలెం గ్రామాల్లో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ, జగనన్న పాల వెలువ కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు నూతన భవనాలు నిర్మించి ప్రారంభించారు. అయితే ఆ భవనాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై పేర్లు కనిపించకుండా ఎన్నికల సందర్భంగా వేసిన స్టిక్కర్లను నేటికీ తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆటోక్యాడ్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణ ఇస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ట్రైనర్ లక్ష్మీప్రసన్న

ఒంగోలు: బేసిక్స్ ఇన్ ఆటోక్యాడ్ అనే అంశంపై స్థానిక క్విస్ కాలేజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ట్రైనర్ లక్ష్మీప్రసన్న హాజరై రెండు రోజుల్లో 1050 మంది విద్యార్థులకు ఆటోక్యాడ్‌పై అవగాహన కల్పించారు. క్విస్ కాలేజీ గ్రూప్ చైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఆధునిక ఇంజినీరింగ్, డ్రాయింగ్ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. కాలేజీ వైస్ చైర్మన్ నిడమానూరి గాయత్రీదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంగా చదువుకోవాలన్నారు.

మెకానికల్ విభాగపు అధిపతి డాక్టర్ జి.నవనీత కృష్ణన్, ఉప విభాగపు అధిపతి డాక్టర్ కె.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, మొదటి సంవత్సరం విభాగం అధిపతి డాక్టర్ జి.శ్రీనివాసరావు విద్యార్థులకు ఆటోక్యాడ్ గురించి వివరించారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు సాధించాలి



విద్యార్థులకు స్టడీ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు సాధించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆయన స్టడీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చినా సహించే ప్రసక్తే లేదన్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడంలో బాధ్యతగా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని స్వర్ణకుమారి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించినందుకు క్యాష్ అవార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ కడప లక్ష్మి, జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనిత, శోభన్, భారతి, జయభారతి పాల్గొన్నారు.

చెట్ల కింద బారకట్ట



చెట్లకింద బారకట్ట ఆడుతున్న ప్రజలు

దొనకొండ: గ్రామాల్లో వ్యవసాయ పనులు, కూలి పనులు లేక పోవడంతో పురుషులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు చెట్ల కింద ముచ్చటించుకుంటూ భారకట్ట ఆడుతున్నారు. ఈ ఏడాది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సార్వత్రిక ఎన్నికల ముందే నిలిపివేశారు. దీంతో రోహిణి, మృగశిర కార్తెల్లో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ వ్యవసాయ పనులు సాగిద్దామని ఆకాశం వైపు చూస్తున్నారు. ఎండలు ఏ రోజుకు ఆ రోజు ఎక్కువగా ఉన్నాయి. గ్రామాల్లోని ప్రజలు బయటకు వెళ్లకుండా ఇళ్లల్లోనే కాలం గడుపుతున్నారు. మరికొంత మంది చెట్ల కింద భారకట్టలు ఆడుతున్నారు. వాళ్లను 'సాక్షి' పలకరించగా ఈ ఏడాది ఏం వానలు పడతాయో, ఏం పంటలు పండుతాయో, ఎలా జీవించాలో, అప్పులు ఎలా తీర్చాలో సందిగ్ధంలో పడ్డామని విచారం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారంపై చర్యలు

కురిచేడు: స్థానిక మంచినీళ్ల బావి బజారులో డ్రైనేజీ సమస్య పెరిగిపోయింది. నివాస గృహాల వారి మధ్య నిత్యం గొడవలకు దారితీస్తోంది. ఆ ప్రాంతాన్ని సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీలు గురువారం పరిశీలించారు. డ్రైనేజీతో పాటు విద్యుత్ తీగలు కూడా సమస్యాత్మకంగా మారాయని, ఆ సమస్యల పరిష్కారానికి ఆ ప్రాంత నివాసితులతో చర్చలు జరిపి పరిష్కరించాల్సి ఉందని ఈఓఆర్డీ ప్రసాదరావు తెలిపారు. ఒకటి రెండు సార్లు ప్రయత్నించి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. అప్పటి వరకు ఎవరూ గొడవలు పడవద్దని అధికారులు సూచించారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయండి



వైపాలెంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, హెచ్‌ఎంలు

యర్రగొండపాలెం: నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ, పంచాయతీ కార్యదర్శులు, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6–14 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించాలని, ఈ మేరకు హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలన్నారు. బడిఈడు పిల్లలు బాల కార్మికులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత తమ అందరిపై ఉందని, బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూనాయక్ అన్నారు. గ్రామాల్లో ర్యాలీలు, సెమినార్లు జరిపి డ్రాపౌట్ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్, ఏపీఎం ఎడ్వర్డ్, సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాధవీలత

ముండ్లమూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాధవీలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైద్య సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో నిత్యం ఆరోగ్య సిబ్బంది గృహ సందర్శన కార్యక్రమం నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి నేరుగా ఇంటి వద్దే చికిత్స అందించాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. లార్వాను నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిని డాక్టర్ పద్మజ మాట్లాడుతూ గ్రామాల్లో టీకాల నిర్వహణ అనంతరం తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నారా లేదా చూసుకోవాలన్నారు. టీకాలు వేసే సమయంలో తప్పని సరిగా ఏఎన్ఎం అందుబాటులో ఉండాలన్నారు. టీకాలు రియాక్షన్ రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మధుశంకర్, జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.